సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024

కుక్క.. కావాలి లెక్క..!



రాష్ట్ర ప్రభుత్వం వీధికుక్కలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వీధికుక్కల సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వివరాలు 8లో ▸

ఎకో ఫ్రెండ్లీ రాఖీ

- మామిడి, రావి ఆకులు, పువ్వులు, పప్పలతో రాఖీల తయారీ
- ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట మహిళలు
- డీపీఓ దేవకిదేవి వినూత్న ప్రయత్నం
- జిల్లా వ్యాప్తంగా 50వేలకు పైగా తయారీ

సండే స్పెషల్





అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. సోదరుల రక్షణ కోరి అక్కా చెల్లెల్లు కట్టే రాఖీ పండగకు ఎంతో విశిష్టత ఉంది. శుభసూచికమైన మామిడి ఆకులు, రావి ఆకులు, పువ్వులు, పప్పలతో పర్యావరణహిత రాఖీలు తయారీ చేస్తున్నారు సిద్దిపేట మహిళలు. ఈ వినూత్న ఒరవడికి జిల్లా పంచాయతీశాఖ అధికారి దేవకీదేవి శ్రీకారం చుట్టారు. ఎకో ఫ్రెండ్లీ రాఖీలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు తమ సోదరులకూ రాఖీలను కడుతూ పర్యావరణహితంలో భాగస్వాములవుతున్నారు.



- పడిగె వెంకటేశ్
సిద్దిపేట రూరల్:

8లో

దాడులు అరికట్టాలి..



సదాశివపేటలో భారీ ర్యాలీ చేపట్టిన హిందూ సంఘాలు

సదాశివపేట(సంగారెడ్డి): బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ మందిరాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్‌ చేస్తూ శనివారం పట్టణంలో విశ్వహిందూ పరిషత్‌, బజరంగ్‌దళ్‌, హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌ విజయవంతమైంది. ఈ సందర్భంగా జాతీయ జెండాలు పట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. నాయకులు పవన్‌గౌడ్‌, సంగమేశ్వర్‌, రమేష్‌, విశ్వనాథం, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి..



పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్‌: వైద్యురాలి హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వైద్యులు గంట వైద్య సేవలు నిలిపివేసి.. నో సేఫ్టీ.. నో డ్యూటీ.. జస్టిస్‌ టు కోల్‌కతా డాక్టర్‌ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందితుడిని శిక్షించాలని డిమాండ్‌ చేశారు. ఆర్‌ఎం డాక్టర్‌ ప్రవీణ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్‌

స్కావెంజర్లను విధుల్లోకి తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: ప్రభుత్వం తొలగించిన పాఠశాలల స్వీపర్లను, స్కావెంజర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఈఓ వెంకటేశ్వర్లుకు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రసాద్‌ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పజెప్పకుండా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగేలా కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో గతంలో పనిచేసిన స్వీపర్‌, స్కావెంజర్లను విధుల్లోకి తీసుకొని ప్రతినెలా జీతాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో యాదమ్మ, లక్ష్మి, గోపాల్‌, జయమ్మ, సునీత, జ్యోతి, కమల, గోపాల్‌ తదితరులున్నారు.

ట్రిబుల్‌ఆర్‌ అలైన్‌మెంట్‌ మార్చాలని నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

సంగారెడ్డి : ట్రిపుల్‌ఆర్‌ అలైన్‌మెంట్‌ మార్చాలని కొండాపూర్‌ మండలం గిర్మాపూర్‌, సదాశివపేట, పెద్దపూర్‌ గ్రామాల రైతులు శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఆర్‌ఆర్‌ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వకూడదని ఏకగ్రీవ తీర్మానం చేస్తామని అన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల భూములు నేషనల్‌ హైవే, పెద్దపూర్‌ ఫిల్టర్‌బెడ్‌, మంజీర పైపులైన్‌, చెరువులు, కాల్వల నిర్మాణాలకు సేకరించడంతో రైతులు కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పంటలు పండే భూములను లాక్కుంటే జీవనాధారం లేకుండా అవుతుందన్నారు. మంజీర డ్యాం, ఫిల్టర్‌బెడ్లు, మల్కాపూర్‌ పెద్ద ఇరిగేషన్‌ చెరువుల మధ్య నుంచి రింగ్‌రోడ్డు వేయడం రైతుల నోట్లో మట్టికొట్టడమే అవుతుందన్నారు.రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. వీరికి రైతు సంఘాల నాయకులు గొల్లపల్లి జయరాజు, పృథ్వీరాజు రాఘవేందర్‌రెడ్డి, టీజేఎస్‌ నాయకులు తుల్జా రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గిర్మాపూర్‌ మాజీ సర్పంచ్‌ మల్లేశం, పెద్దాపూర్‌ మాజీ సర్పంచ్‌ మల్లేశం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్‌: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ హ్యాండ్‌లూమ్‌ టెక్నాలజీ హైదరాబాద్‌ చేనేత టెక్స్‌ టైల్స్‌ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులో ప్రవేశాల కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు రవీందర్‌ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో 60సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. 2024 జులై 1 నాటికి జనరల్‌ కేటగిరీ, బీసీ 23, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 25ఏళ్లలోపు ఉండాలన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు నాంపల్లిలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టు బీ ప్రాసెస్డ్‌..



కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఛాంబర్‌ ముందు వేచి ఉన్న ఈ రైతులందరి పంట రుణాలు మాఫీ కాలేదు. ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకునేందుకు వీరంతా జిల్లాలో వివిధ మండలాల నుంచి ఇక్కడికి వచ్చి ఆరా తీశారు. అన్ని అర్హతలున్న తమ పంట రుణాలను కూడా మాఫీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

- కుటుంబసభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉంది..
- వ్యవసాయశాఖ పోర్టల్‌లో ఇలా కారణాలు దర్శనం
- ఎవరు.. ఎప్పుడు.. నిర్ధారిస్తారంటున్న అన్నదాతలు
- మూడో విడతలోనూ వందలాది మంది రైతులకు కాని రుణమాఫీ
- అధికారుల వద్దకు రైతులు పరుగులు

జిల్లాలో మూడో విడతలోనూ అరకొర రైతులకు మాత్రమే పంటరుణాలు మాఫీ అయ్యాయి. మాఫీ కాని రైతులు వేలల్లో ఉంటున్నారు. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో రుణాలు మాఫీ కాలేదు. పూర్తి అర్హతలున్నప్పటికీ తమ రుణాలు ఎందుకు మాఫీ కాలేదో అర్థం కాక అన్నదాతలు బ్యాంకుల చుట్టూ, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు ఉన్న రైతులకు సంబంధించిన ఖాతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి ప్రభుత్వం డబ్బులు జమ చేసింది. శనివారం కూడా డబ్బులు జమ అయ్యాయి. ఆయా గ్రామాల్లో పదుల సంఖ్యలో రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు.

వ్యవసాయశాఖ పోర్టల్‌లో..

రుణాలు మాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయశాఖ పోర్టల్‌లో పరిశీలిస్తే సుమారు 30కి పైగా కారణాలు చూపుతోంది. కుటుంబసభ్యుల నిర్ధారణ కావాల్సి ఉంది.. అంటూ పోర్టల్‌లో చూపుతోంది. తమ కుటుంబ సభ్యులను ఎవరు నిర్ధారిస్తారు.. ఎప్పుడు నిర్ధారిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. దంపతులిద్దరి పేర్ల మీద రుణం ఉంటే ఏ ఒక్కరి రుణం కూడా మాఫీ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమ రుణం మాఫీ కాకపోవడానికి చిన్న చిన్న కారణాలు చూపుతున్నారని అంటున్నారు.

4,400కుపైగా దరఖాస్తులు

మూడో విడతలో జిల్లాలో 16,676 మంది రైతు కుటుంబాలకు చెందిన 20,102 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ అయినట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. రూ. 1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు పంట రుణం బకాయి ఉన్న రైతుల రుణాలు మూడో విడతలో మాఫీ అయ్యాయి. కానీ మాఫీ కాని రైతులు వేలల్లో ఉన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయశాఖకు సుమారు 4,400లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీరంతా తమ లోన్లు మాఫీ కాలేదని వ్యవసాయశాఖ అధికారులకు విజ్ఞప్తులు చేసుకున్నారు.

ఆ బ్యాంకుల రైతుల వివరాల్లో గందరగోళం

జిల్లాలో నాలుగు బ్యాంకుల్లో ఖాతాలున్న వేలాది రైతుల రుణాల మాఫీ విషయంలో గందరగోళం నెలకొంది. ఐడీబీఐ, బ్యాంక్‌ఆఫ్‌ ఇండియా, సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, ఇండియన్‌బ్యాంకు.. ఈ నాలుగు బ్యాంకుల్లో ఖాతాలున్న రైతుల వివరాలు అధికారుల చూపిన జాబితాలో కనిపించడం లేదు. దీంతో గందరగోళం నెలకొంది. అయితే ఈ బ్యాంకుల్లోని రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ అయ్యాయి.. కానీ అర్హులైన రైతుల జాబితాలో ఈ నాలుగు బ్యాంకుల్లోని రైతుల పేర్లు కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు.

మాఫీ ఎందుకు కాలేదో తెలుస్తలేదు..



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఈ భూమికి సంబంధించి ఎస్‌బీఐలో పంట రుణం తీసుకున్న. కానీ మా రుణం మాఫీ కాలేదు. అక్కడి అధికారులను అడిగిన. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన. అన్ని అర్హతలున్నప్పటికీ మా రుణం ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు.

నాయికోటి నాగభూషణం,
ఖమ్మంపల్లి, మునిపల్లి మండలం.

మూడు విడతల్లోనూ రాలేదు



మంజీరా గ్రామీణ బ్యాంకు శివంపేట బ్రాంచ్‌లో రూ.88 వేల రుణం ఉంది. కానీ నాకు మూడు విడతల్లోనూ నా రుణం మాఫీ కాలేదు. ఒకటో విడతలో రాలేదని అధికారుల వద్దకు వెళితే.. రెండో విడతలో వస్తాయని చెప్పారు.. కానీ రెండో విడతలో కూడా రాలేదు. ఇప్పుడు మూడో విడతలోనూ నా పేరు లేదు.

- చిన్నొల్ల రాంరెడ్డి,
వెండికోల్‌, చౌటకూర్‌ మండలం

మాఫీ కాని రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో..

మూడు విడతల్లోనూ పంట రుణాలు మాఫీ కాని అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. వారికి ఎందుకు రాలేదో పోర్టల్‌లో పరిశీలించి.. అందుకు అవసరమైన డాక్యుమెంట్లను పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేస్తాం. ఈ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తాం.

- నర్సింహారావు,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పకడ్బందీగా ఓటరు జాబితా

రూపొందించాలని
రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశం

సంగారెడ్డి జోన్‌: వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పి.సుదర్శన్‌ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్‌ లోని సీఈఓ కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్‌ క్రాంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బూత్‌ లెవెల్‌ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో మాస్టర్‌ ట్రైనర్స్‌ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీఎల్‌ఓ తమ వద్ద ఉన్న యాప్‌లో ఓటర్‌ వివరాలు సవరణ చేస్తూ ఓటర్ల పేరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ మాధురి పాల్గొన్నారు.

పోడు భూముల దరఖాస్తులు పరిష్కరించాలి

పోడు భూముల పట్టా కోసం వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి దాసరి అనసూయ(సీతక్క) సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ వల్లూరి క్రాంతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జిల్లా ఇన్‌చార్జి అఖిలేష్‌ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ చట్టం ప్రకారం 13 డిసెంబర్‌ 2005 నాటికి సాగు చేస్తున్న గిరిజనులు, మూడు తరాల పాటు సాగుచేసిన గిరిజనేతరులకు అటవీ భూములకు మాత్రమే పట్టాలు అందించాలన్నారు. కొత్తగా అటవీ భూమి కూడా సాగు చేయడానికి వీలు లేదని, అటవీ శాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, అక్రమాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి తెలంగాణ రాష్ట్ర గిరిజనులకు, ఆదివాసులకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారు. పట్టాలు మంజూరు చేసిన పోడు భూములలో రైతులు పామ్‌ ఆయిల్‌, జీడి మామిడి తదితర లాభదాయక పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ భూమిలోని సంపద అక్రమ రవాణా జరగకుండా పక్కాగా నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి యోగాకు 42మంది ఎంపిక



ప్రశంసా పత్రాలతో యోగా క్రీడాకారులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వివిధ కేటగిరీలలో 42 మంది ఎంపికైనట్లు యోగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్‌, రమేష్‌ తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని అంబేడ్కర్‌ స్టేడియంలో జిల్లాస్థాయి యోగా సెలక్షన్స్‌ జరిగాయి. ఇందులో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొనగా, 42 మందిని ఎంపిక చేశారు. వీరంతా అక్టోబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులకు అబ్జర్వర్‌ సత్యనారాయణ పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, శ్రీదేవి, దివ్య, వీరయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం ఇచ్చేవరకు పోరాడుదాం



చుక్క రాములును సన్మానించిన కార్మికులు

పటాన్‌చెరు టౌన్‌: పరిశ్రమల యజమాన్యాలు కాంట్రాక్ట్‌ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని శాండ్విక్‌ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదలకు కృషిచేసిన చుక్క రాములును శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోర్టు జోక్యం చేసుకోవడంతో తప్పని పరిస్థితుల్లో ఒక్క రూపాయి కూడా పెంచకుండా గతంలో ఉన్న వేతనాలతోనే రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కొత్త జీఓలు విడుదల చేయడం దారుణం అన్నారు. భవిష్యత్తులో కనీస వేతనాల కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాండ్విక్‌ యూనియన్‌ నాయకులు పి.పాండురంగారెడ్డి, ఎ.వీరారావు, సదాశివ రెడ్డి, నర్సింహులు, గంగాధర్‌, విష్ణు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన.. వాహనదారుల హైరానా



సంగారెడ్డిలో రోడ్డుపై పారుతున్న వర్షం నీరు



పటాన్‌చెరు ముత్తంగి ఓఆర్‌ఆర్‌ సమీపంలో..

సంగారెడ్డి / సంగారెడ్డి టౌన్‌: జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలో భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు అర్ధగంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. రోడ్లపై నీరు నిలవడంతో సాయంత్రం వేళ ఇంటికి వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరుటౌన్‌ : పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముత్తంగి ఓఆర్‌ఆర్‌ జాతీయ రహదారి పక్కన రోడ్డుపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలవడంతో ట్రాఫిక్‌ జామ్‌ అయ్యింది. అదేవిధంగా ఇస్నాపూర్‌, పాశమైలారం వెళ్లేదారిలో జాతీయ రహదారిపై వర్షపు నిలవడంతో పారిశ్రామికవాడ నుంచి వచ్చే కార్మికులు ఇబ్బంది పడ్డారు. అలాగే బీరంగూడలోని భ్రమరాంబిక నగర్‌లో రోడ్లు జలమయమయ్యాయి.

సిద్దిపేటలో హైటెన్షన్‌

- బీఆర్‌ఎస్‌ వర్సెస్‌ కాంగ్రెస్‌
- చిచ్చురేపిన హరీశ్‌రావు క్యాంప్‌ కార్యాలయంపై ఫ్లెక్సీ చించివేత
- నిరసనగా నల్లబ్యాడ్జీలతో ర్యాలీ, రాస్తారోకో
- సీఎం రేవంత్‌ దిష్టిబొమ్మ దగ్ధం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్‌ దాడి నిరసిస్తూ బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ

సిద్దిపేటజోన్‌: రుణమాఫీ సవాళ్ల పర్వం శనివారం సిద్దిపేటలో ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలో 12 గంటల పాటు టెన్షన్‌ వాతావరణం నెలకొంది. హరీశ్‌రావు రాజీనామా చేయాలని శుక్రవారం అర్ధరాత్రి ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో వీటిని బీఆర్‌ఎస్‌ నేతలు తొలగిస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై ఎక్కి హరీశ్‌రావు ఫ్లెక్సీని చించివేశారు. దానికి నిరసనగా శనివారం మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ రాజనర్స్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌లు సాయిరాం, వేణుగోపాల్‌ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో పాత బస్టాండ్‌ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ రాస్తారోకో చేసి దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కాగా, ముందస్తు జాగ్రత్తగా భాగంగా పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించే యత్నించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మరోవైపు పాత బస్టాండ్‌, బీజేఆర్‌ చౌరస్తా పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌ రెడ్డి ఫ్లెక్సీలను కొందరు బీఆర్‌ఎస్‌ నాయకులు చించివేసి, సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. మళ్లీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదకు కాంగ్రెస్‌ నాయకులు దాడికి వస్తున్నారని పుకార్లు రావడంతో పెద్ద ఎత్తున అక్కడికి బీఆర్‌ఎస్‌ నాయకులు బయలుదేరారు. ఆ మేరకు సీపీ నుంచి ఆదేశాల రావడంతో పోలీసు బలగాలను మోహరించారు. ఇరువర్గాల నాయకులపై కేసులు నమోదయ్యాయి.

అక్రమంగా డబుల్‌ రిజిస్ట్రేషన్‌

చర్యలు తీసుకోవాలని
కేఏ పాల్‌ వినతి



మాట్లాడుతున్న కేఏ పాల్‌

సంగారెడ్డి జోన్‌: చారిటీ గమ్‌ సిటీ భూములలో డబుల్‌ రిజిస్ట్రేషన్‌ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ క్రాంతికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సదాశివపేటలోని చారిటీ సిటీ 1200 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. కొందరు ఆ భూమిలో కొన్ని ఎకరాలను డబుల్‌ రిజిస్ట్రేషన్‌ చేశారన్నారు. ఎవరైనా నా బంధువులు అంటూ చెప్పి భూములు అమ్మడానికి వస్తే ఎవరూ కొనుగోలు చేయొద్దని సూచించారు. భూముల గురించి అడిగిన చారిటీ మేనేజర్‌ మోహన్‌ దాసుపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ రూపేష్‌ను కోరినట్లు తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు చేసిన కుట్రలతోనే చారిటీ సిటీలో సేవా కార్యక్రమాలు నిలిచిపోయాయని, తిరిగి అక్టోబర్‌ 2 నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అధికారంలోకి వచ్చి 9నెలలవుతున్నా సీఎం రేవంత్‌ ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్‌ 1 వరకు తాను ఇచ్చిన లెటర్‌కు రెస్పాండ్‌ అయితే ఒక్క నెలలో 100 పరిశ్రమలు తీసుకువచ్చి లక్ష ఉద్యోగాలు కల్పిస్తానన్నారు.

క్లుప్తంగా

మాఫీ కాలేదని రోడ్డెక్కిన రైతులు

రాముునిపట్ల వద్ద రాస్తారోకో



రాముునిపట్ల వద్ద రాజీవ్‌రహదారిపై రాస్తారోకో

చిన్నకోడూరు(సిద్దిపేట): మూడో విడత రుణ మాఫీ కాలేదని నిరసిస్తూ శనివారం చిన్నకోడూరు మండల పరిధిలోని రాముునిపట్ల వద్ద రాజీవ్ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిబంధనల పేరుతో కోత పెట్టారని విమర్శించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు రైతులను సముదాయించారు.

పార్ట్‌టైం జాబ్ అంటూ సైబర్ మోసం

రూ. లక్ష 80 వేలు పోగొట్టుకున్న గృహిణి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ గృహిణి రూ.లక్ష 80 వేలు పోగొట్టుకుంది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడకు చెందిన గృహిణికి పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు ఆగస్టు 13న మెసేజ్ వచ్చింది. ఆమె తన వివరాలను నమోదు చేశారు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో గృహిణి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టింది. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. లక్ష 80 వేలు చెల్లించింది. సైబర్ నేరగాళ్లు గృహిణితో నగదు పెట్టిస్తూ, తనకు ఇచ్చిన వాలెట్ లో నగదు తో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో గృహిణి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణం పేరిట మోసం

రూ.48వేలు కాజేసిన సైబర్‌నేరగాళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఐదు లక్షల రుణం మంజూరైందని ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తిని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.48 వేలు కాజేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధి చెన్నాపూర్‌కు చెందిన బోళ్ల ఆంజనేయులుకు వారం క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీకు రూ.5లక్షల రుణం మంజూరైందని నమ్మబలికాడు. మీ ఖాతాలో లోన్ డబ్బులు జమ చేస్తామని బ్యాంకు వివరాలు అడగడంతో ఆంజనేయులు చెప్పేశాడు. దీంతో అకౌంట్‌లో నుంచి 48వేల 433 రూపాయలు కాజేశారు. ఖాతాలో నుంచి డబ్బులు కాజేసిన విషయం గుర్తించి అపరిచిత వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో తాను మోసపోయానని గ్రహించి బాధితుడు శనివారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. శనివారం మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన హరిజన లక్ష్మయ్య (36) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగినట్లు ఏఎస్‌ఐ ఎసయ్య తెలిపారు. కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796266]

■ సైట్ ఇంజినీర్స్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్) సైట్ అకౌంటెంట్స్/సైట్ సూపర్‌వైజర్స్ / డ్రైవర్స్ కావలెను. మహారాష్ట్ర, కర్ణాటక మరియు తెలంగాణలో లిఫ్ట్ ఇరిగేషన్‌లో డ్రైవర్స్ హైవే అనుభవం ఉన్నవాళ్లు కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyd. కాల్: 040-23338080, adm.vineela@gmail.com. సంప్రదించు సమయం: 10am to 5pm [H-804857]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించ వలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎకో ఫ్రెండ్లీ రాఖీ



ఎకో ఫ్రెండ్లీ రాఖీలతో..

- మామిడి, రావి ఆకులు, పువ్వులు, పప్పులతో రాఖీల తయారీ
- ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట మహిళలు
- డీపీఓ దేవకిదేవి వినూత్న ప్రయత్నం
- జిల్లా వ్యాప్తంగా 50వేలకు పైగా రాఖీల తయారీ

సిద్దిపేటరూరల్: సంకల్పం ఉంటే చాలు సాధ్యంకానిది ఏదీ లేదని భావించారు జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి. మానవుని మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్లాస్టిక్, రసాయనాలతో తయారవుతున్న రాఖీలకు బదులు పర్యావరణహితం రాఖీలను తయారు చేయాలనే ఆలోచన తట్టగానే కార్యక్షేత్రంలోకి దిగారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులకు ఎకోరాఖీల తయారీపై అవగాహన కల్పించారు. రాఖీల తయారీ గురించి ఒక వీడియోను రూపొందించారు. దీన్ని చూసి మహిళలు నేర్చుకున్నారు. ఇలా ప్రకృతి సిద్ధమైన ఆకులతో రాఖీలను తయారు చేయడం వల్ల ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుందని వివరించారు. ప్రతి పంచాయతీలో 100 నుంచి 200 వరకు మామిడి, రావి, పువ్వులు, పప్పు దినుసులు వంటి వాటితో ఈ రాఖీలను తయారు చేయించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 50వేలకు పైచిలుకు ఎకో ఫ్రెండ్లీ రాఖీలను తయారు చేశారు.

ఖర్చు లేకుండానే...

సోదరులకు రాఖీలను కట్టేందుకు వస్తున్న అక్కాచెల్లెళ్లు తమ స్థోమతలను బట్టి రాఖీలను కొనుగోలు చేస్తారు. వాటికి వినియోగించే ప్రమాదకరమైన రసాయనిక రంగులు, మైక్రోప్లాస్టిక్ పదార్థాలు ఏదో ఒక రకంగా మానవ శరీరంలోకి వెళ్తుండటంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం లేకపోలేదు. దీంతో ఆరోగ్యంతో పాటు, పర్యావరణం కూడా దెబ్బతింటుంది. ఎకో ఫ్రెండ్లీ రాఖీలతో ఎలాంటి ఖర్చు లేకుండా ఇంట్లో ఉన్న దారంతో ప్రకృతి సిద్ధమైన ఆకులు, పువ్వులతో రాఖీలను తయారు చేసుకుని సోదరులకు కట్టడం ద్వారా నూతన అనుభూతి పొందుతున్నారు. పర్యావరణాన్ని కాపాడేవారవుతారు.



అంగన్‌వాడీల్లో, పాఠశాలలో చిన్నారులు కడుతున్న రాఖీలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎకో ఫ్రెండ్లీ రాఖీ కడుతున్న డీపీఓ దేవకిదేవి

ఆచరిస్తూ.. అమలు చేస్తూ..

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి రక్షాబంధన్ పండుగ రోజు తన సోదరులకు ఎకోఫ్రెండ్లీ రాఖీలను కడుతారు. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్న క్రమంలో తనకు ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీని జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించారు. రాఖీ పండుగను పర్యావరణహితంగా మార్చాలని కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. తానే స్వయంగా తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ రాఖీని జిల్లా అధికారులకు, నాయకులకు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎకోఫ్రెండ్లీ రాఖీని కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యంతో పాటు పర్యావరణ రక్షణ



మానవుని మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్లాస్టిక్, రసాయనాలతో తయారైన వస్తువులను వాడుతూనే ఉంటాం. సోదరులకు కట్టే రాఖీతో ఆరోగ్యంతో పాటు భూమికి, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా ఈ ఎకో ఫ్రెండ్లీ రాఖీలు దోహదపడుతాయి. దీని ద్వారా ప్లాస్టిక్‌ను నివారించేందుకు వీలుంటుంది. చాలా కాలంగా నా సోదరులకు ఇలా పర్యావరణహితంగా తయారు చేసిన రాఖీలనే కడుతూ వారి ప్రేమానురాగాలను పొందుతూ వస్తున్నా. కుటుంబీకుల, పర్యావరణ మేలు కోరే ప్రతీ ఒక్కరూ ఎకోఫ్రెండ్లీ రాఖీలను వినియోగించాలి.

– దేవకిదేవి, జిల్లా పంచాయతీ అధికారి

స్వచ్ఛ రాఖీలు కట్టండి

నంగునూరు(సిద్దిపేట): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పర్యావరణాన్ని రక్షించేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ ఆధ్వర్యంలో ఆకులు, పువ్వులతో రాఖీలు తయారు చేసి శనివారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రకృతి సిద్ధంగా లభించే ఆకులు, పువ్వులతో స్వచ్ఛ రాఖీలు తయారు చేశామన్నారు. గ్రామస్తులందరూ పర్యవరణానికి హాని చేసే రాఖీలు కాకుండా స్వచ్ఛ రాఖీలు తయారు చేసి తమ సోదరులకు కట్టాలని సూచించారు.



స్వచ్ఛ రాఖీలు కట్టుకుంటున్న నంగునూరు గ్రామపంచాయతీ సిబ్బంది

ఎకో ఫ్రెండ్లీ రాఖీలను కడుతున్నా

గత సంవత్సరం నుంచి నా సోదరులకు ఎకో ఫ్రెండ్లీ రాఖీలను కడుతున్నాను. ఎవరో తయారు చేసిన రాఖీని అన్నలకు కట్టకుండా నేనే స్వయంగా ఎంతో ఇష్టంగా మంచి పూలను సేకరించిన ఎకోఫ్రెండ్లీ రాఖీని తయారు చేస్తాను. పండుగ రోజు మా అన్నాదమ్ములకు పూలతో తయారు చేసిన రాఖీని కడుతాను. చాలా సంతోషంగా ఉంటుంది.

– పుష్ప, అంగన్‌వాడీ టీచర్ , సిద్దిపేట

నేను చనిపోతున్నా..!

- భగ్నప్రేమికుడి ఆత్మహత్య
- ప్రేమికురాలికి వాట్సాప్ మెసేజ్
- పెళ్లికి పెద్దలు అంగీకరించడం లేదని మనస్తాపం



రజనీకాంత్ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పంతం లలిత, భూమయ్య దంపతుల చిన్నకుమారుడు రజనీకాంత్(30) కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన యువతితో రజనీకాంత్‌కు వివాహం జరిపించాలని పెద్దల సమక్షంలో నిర్ణయమైంది. ఆ యువతి వేరే గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. కొద్ది నెలల క్రితం సదరు యువతి భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె పుట్టిల్లు అయిన ఇబ్రహీంనగర్‌లో ఉంటుంది. ఈ క్రమంలో యువతి, రజనీకాంత్ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. రజనీకాంత్‌కు కుటుంబ సభ్యులు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా నిరాకరిస్తున్నాడు. పైగా యువతితో పెళ్లికి అంగీకరించడం లేదు. దీంతో మనస్తాపం చెందిన రజనీకాంత్ శుక్రవారం ఉదయం షాపునకు వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లాడు. తాను చనిపోతున్నానని ఆ యువతికి రజనీకాంత్ వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాడు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో అంతా వెతికారు. ఆచూకి లభ్యం కాలేదు. శనివారం రజనీకాంత్ సోదరుడు బావి వద్దకు వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

హవేళిఘణాపూర్(మెదక్): కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ మండలం శివ్వాయి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి నవీన్ (30) జీవనోపాధి కోసం మేడ్చల్‌కు తల్లి నర్సమ్మతో వలస వెళ్లాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా వారానికోసారి వచ్చి వెళ్తుండే వాడు. గురువారం శివ్వాయిపల్లికి వచ్చి రాత్రి భార్యా పిల్లలతో సహా అందరూ ఇంట్లోనే హాలులలో నిద్రించారు. అర్ధరాత్రి పక్కనే ఉన్న గదిలోకి వెళ్లిన నవీన్ చీరతో ఉరి వేసుకున్నాడు.

వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు పక్కన ఆగిఉన్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొల్గూరుకు చెందిన నీరుడి(టప్ప) లక్ష్మయ్య(55) తన ద్విచక్ర వాహనంపై గజ్వేల్ నుంచి కొల్గూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో అహ్మదీపూర్ చౌరస్తా దాటిన తర్వాత కొల్గూరు సమీపంలో రోడ్డు పక్కన మొక్కజొన్న కంకులు నింపుతున్న వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మయ్య మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నిస్తే గూండాయిజమా?

- హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి హేయం
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు గూండాయిజంతో మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడులకు తెగబడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మండిపడ్డారు. శనివారం గజ్వేల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేటలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వంద శాతం రుణమాఫీని అమలు చేయాలని హరీశ్‌రావు రైతుల పక్షాన డిమాండ్ చేయడం తప్పా? అంటూ ప్రశ్నించారు. 40 ఏళ్లల్లో సిద్దిపేటలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీపై అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ పుస్తకంలో రాష్ట్రంలో 47లక్షల మంది రైతులకు 2 లక్షల రుణమాఫీ కోసం రూ.37 వేల కోట్లు అవసరమవుతాయని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. కానీ 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి రూ.17.09వేల కోట్లు ఖర్చుచేశారని చెప్పారు. ప్రభుత్వం అధికారికంగా చెప్పిన లెక్కలకు క్షేత్ర స్థాయిలో అమలు తీరుకు పొంతన లేదన్నారు. వందశాతం రుణమాఫీ చేసి, ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తే రాజీనామా చేయడానికి హరీశ్‌రావు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. సమావేశంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు బెండె మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, నాయకులు గోపాల్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ రాజీనామా చేయాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తే, రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు బేషరతుగా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి వెళుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారని, సవాల్‌ను స్వీకరించి హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించడం, తమ పార్టీ నేతలపై దాడులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి కాంగ్రెస్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నాయని, అయితే బీఆర్‌ఎస్ ఉనికే లేకుండా పోతుందని విమర్శించారు. దళిత కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్ర మహేందర్‌పై తీవ్ర దాడి జరిగిందని, అతడిపై దాడి చేసిన వారిపై కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతారావు ఆధ్వర్యంలో సిద్దిపేటలో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరం కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి, సిద్దిపేటలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట అభివృద్ధికి మంత్రి సురేఖ ఆధ్వర్యలో భారీగా నిధులు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

బలమైన ఉద్యమాలు నిర్మించాలి

- దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం
- విద్యార్థులకు ఇఫ్టు జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసాద్ పిలుపు
- పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల కొనసాగింపు



ప్రసంగిస్తున్న ప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశంలో విద్యార్థులు బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలని ఇఫ్టు(భారత కార్మిక సంఘాల సమాఖ్య) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం రెండోరోజు కొనసాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయన్నారు. దీనికి సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ విధానాలే కారణమన్నారు. ఇటీవల బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలు ఇలానే సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. దీనికి ఆ దేశాల్లో పెరుగుతున్న నిరుద్యోగం, అసమానతలు కారణమని ఆరోపించారు. దీని ప్రభావం మన దేశంలో కూడా ఉందన్నారు. అందుకే విద్యార్థులు ఈ సంక్షోభాన్ని ప్రజా ఉద్యమాల వైపు మళ్లించి, అంతిమంగా విప్లవోద్యమం వైపు విద్యార్థులను మరల్చాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ మత విద్వేష రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఆకలి, అసమానతలు, పేదరికం, నిరుద్యోగం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని అధిగమించే చర్యలు పూనుకోకుండా, బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేలా రెడ్ కార్పెట్ వేస్తున్నారని మండిపడ్డారు. పేద, ధనిక తేడాలు లేకుండా దేశ ప్రజలందరికీ సమానమైన పద్ధతిలో విద్య, వైద్యం, అవకాశాలు కల్పించాలన్నారు. సమాజ మార్పుకు విద్యార్థులు చోదక శక్తిగా మారాలని, దేశంలో వర్గ పోరాటాల వైపు విద్యార్థులను మళ్లించేలా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేశ్, శ్రీకాంత్, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూషణం, భాస్కర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గౌతమ్ కుమార్, రాజేశ్వర్, శ్రీకాంత్, శ్యాం, కిరణ్, చరణ్, తిరుపతి, శ్రీను, కార్తీక్, రాణా ప్రతాప్, ఉదయ్ వివిధ జిల్లాల విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్క.. కావాలి లెక్క..!



వీధికుక్కల గుంపు

తెల్లాపూర్ వీధికుక్కల సర్వే చేస్తున్న అధికారులు

జిల్లాలో వీధికుక్కలపై అధికారుల సర్వే

సుమారు 37 వేల కుక్కలు ఉన్నట్లు అంచనా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం వీధికుక్కలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వీధికుక్కల సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారం రోజులుగా జిల్లా పరిధిలోని గ్రామాలు, పట్టణాలలో అధికారులు పర్యటించి వీధికుక్కలను లెక్కిస్తున్నారు. ఇప్పటికి వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో సుమారు 37వేల వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా ఈ సర్వేలలో వీధికుక్కలు ఎన్ని ఉన్నాయి. అందులో ఆడ, మగ కుక్కలు ఎన్ని, వీటిలో పిల్లల సంఖ్యతో పాటు ఎన్ని వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేశారు. ఇంకా ఎన్ని వ్యాక్సినేషన్ ఇవ్వాలన్న వాటిపై సర్వే నిర్వహించారు.

పెరుగుతున్న బాధితులు

రోజురోజుకు కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. కొద్దిరోజుల క్రితమే పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో వీధికుక్కల దాడిలో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన తెలిసిందే. రెండు నెలల క్రితం తెల్లాపూర్‌లో ఒకేరోజు వీధికుక్క సుమారు 20మందిని కరిచి తీవ్రంగా గాయపర్చింది. గత ఏడాదిలో విద్యుత్‌నగర్ కాలనీలో దుకాణానికి వెళ్తున్న ఇంటర్ విద్యార్థిపై వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. నిత్యం వందలాది మంది కుక్కకాటు బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

కష్టంగా మారుతున్న సర్వే

క్షేత్ర స్థాయిలో వీధికుక్కలను లెక్కించడం అంత సాధ్యమైన పని కాదు. ఒక వీధిలోని కుక్కలు వెంటనే మరో వీధిలో దర్శనమిస్తాయి. దాంతో అధికారులకు ఇబ్బందులు తప్పడంలేదు. కష్టంగా ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో సర్వేలో పాల్గొంటున్నారు. కాగా, ఈ సర్వేలో వ్యాక్సినేషన్ ఇవ్వాల్సిన వీధికుక్కలకు గుర్తించి వాటికి వ్యాక్సినేషన్ ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దాంతో పాటు కుక్కలకు పిల్లల నియంత్రణ ఆపరేషన్‌లను చేస్తున్నారు.

పిల్లలను బయటకు పంపించలేని పరిస్థితి: సురేష్, తెల్లాపూర్



వీధికుక్కల దాడులతో చిన్నారులను ఇంటి బయటకు పంపించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మా గ్రామంలో ఒకే రోజు వీధికుక్క 20మందిని కరిచింది. వీధికుక్కల నుంచి ప్రజలకు కాపాడాలి.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై విద్యాచరణ్ రెడ్డి

నారాయణఖేడ్: వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన పంచగామ సుశీల ఈనెల 14న ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండగా.. ఇంట్లోని 24 గ్రాముల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం మన్సూర్‌పూర్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా ఆటోలో వస్తున్న ర్యాకల్‌కు చెందిన ఈడ్గి పండరిగౌడ్ పోలీసులను చూసి పారిపోయాడు. అతడిని పట్టుకుని విచారిస్తే ర్యాకల్‌లో చోరీ చేసిన విషయాన్ని అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో ఖేడ్ పోలీస్ స్టేషన్‌లో రెండు, హైదరాబాదులో ఓచోరీ కేసు ఉంది. జల్సాలకు అలవాటుపడి చోరీలు చేస్తున్నాడు.

ద్విచక్రవాహనం చోరీలో..

ఖేడ్ మండలం సత్యగామకు చెందిన హట్కార్ యాదవరావు తన ఇంటిముందు నిలిపి ఉంచిన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనం ఈనెల 15న రాత్రి చోరీకి గురైంది. శనివారం ఖేడ్ శివారులోని పంచగామ కమాన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న మనూరు మండలం తుమ్నూరుకు చెందిన బేగరి లక్ష్మయ్యను నిలిపి విచారించగా అతడు నడుపుతున్న వాహనం చోరీకి గురైన వాహనంగా గుర్తించి అతడిని అరెస్టుచేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో ఏడు చోరీ కేసులు ఉండగా మనూరులో ఓ వాహనం చోరీ కేసులో రిమాండులో ఉండి ఈనెల 10నే జైలు నుంచి వచ్చి చోరీకి పాల్పడ్డాడు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చారు.